కంసావతారాలు

-డి. కామేశ్వరి

తారు రోడ్డు దిగి మలుపు దగ్గర కచ్చా రోడ్డు వెంట జీపు గతుక్కుల్లో పడి ప్రయాణం చేస్తుంది. రెండు మైళ్ల దూరం కచ్చా రోడ్డులో వెళ్లాక ఆ గ్రామం వచ్చింది. జీపు ఓ పాక ముందు ఆగింది. డ్రైవరు హారన్ మోగించాడు. హడావిడిగా పంచ సర్దుకుంటూ ఓ వ్యక్తి లోపల్నించి వచ్చాడు - 'దండాలు దొరా...' అన్నాడు జీపులో కూర్చున్న వ్యక్తిని చూసి... 'ఏం కొండయ్యా బాగున్నావా... రా జీపెక్కు, అలా వెడదాం' అన్నాడు. 'ఒక్క నిముషం సారూ' లోవలికెళ్లి చొక్కా తగిలించుకుంటూ వచ్చి జీపెక్కి వెనకాల కూర్చు న్నాడు. అలవాటయిన చోటన్నట్టు డ్రైవరు వూరు బయటకి తీసి వెళ్లి ఆపాడు. 'ఏమిటి సంగతులు - ఏదన్నా బేరం తగులుతుందా ఈ నెలలో అయినా' సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు కంట్రాక్టరు వెంకటరత్నం-

'మన ముత్యాలు భార్య నెలతప్పినట్లుందండి - మా ఆడదంటంది'

'ఇది వరకెంత మంది పిల్లలు - మన ఖాతాలోదా, కొత్త కష్టమరా?' ఆరా తీసాడు.

'గుర్తు లేదా, ఇది వరకు మూడేళ్ల క్రితం ఆడపిల్లని తీసుకెళ్లారు గదా'

'ఓ... ఆ ముత్యాలా వాడి పొలం అప్పుల్లోంచి విడిపించాం. వాడేనా'

'ఆ... ఆ... ఇదివరకే వాడికి ఓ కూతురు, ఓ కొడుకున్నారు. ఇది నాలుగో కానుపు'

"బేరం బయటికి పోనీమాకు. అడ్వాన్స్ యిచ్చేయి ముందస్తుగా - ఓ వెయ్యి కొట్టి బుక్ చేసేయ్. కాదు కూడదంటే ఇంకో వంద రెండొందలు ఎక్కువ పడేయ్ - ఆ పిల్ల తెల్లగా ముద్దుగా బాగుంది - ధర బాగా పలికింది' ఆశగా అన్నాడు.

'ఆడి పెళ్లాం చక్కటిదిగా మరి - పిల్లలంతా బాగానే వుంటారు మరి'

'అందుకే మరీ ఆలస్యం చేయకుండా అడ్వాన్స్ యిచ్చేసి ఆడ్ని వప్పించేయ్ - అదొక్కటే కేసా, యింకెవరూ లేరా' ఆశగా చూశాడు వెంకటరత్నం.

'తెలియదండి. వుంటే బయటికి వచ్చేదే గాని లోపలికి పోయేది కాదు గదా - ఆల్లే వచ్చి చెపుతారు, డబ్బులు రుచి మరిగారు లెండి...' వెకిలి నవ్వు నవ్వాడు కొండయ్య.

జేబులోంచి డబ్బులు తీసి వెయ్యి కట్ట, వేరే వంద నోటొకటి తీసి కొండయ్య చేతిలో పెట్టాడు. 'అడ్వాన్స్ యిచ్చేయ్ ముత్యాలుకి - ఇంద, వంద తీసుకో నీవు' ఉదారంగా అన్నాడు. కొండయ్య మరో వెకిలి నవ్వు నవ్వి వంద తీసుకోకుండా 'ఇంట్లో సరుకులు నిండుకున్నాయి. ఆడది కట్టుకోను కోకలు లేవని గోలెడుతుంది. ఐదొందలన్నా యిప్పించాలి దొరా...' వినయంగా అన్నాడు. 'ఒరే, నీకాశ పెరిగిపోతోంది. నా యిక్కెనెస్ కనిపెట్టి డబ్బులు గుంజుతున్నావు తెలివి మీరావురోయ్..' అంటూ మరో వంద తీసి చేతిలో పెట్టాడు. 'ఇంకో గుడ్ న్యూస్ సెప్పు అప్పుడు సూద్దాం... ఊ... బెట్టుసేయకు తీసుకుని జీపెక్కు' - గంభీరంగా అని జీపెక్కాడు వెంకటరత్నం. బుర్రగోక్కుని డబ్బులు జేబులో పెట్టుకొని జీపెక్కాడు. గుడిసెలోకి వచ్చిన మొగుడ్ని చురచుర చూసింది వెంకటమ్మ 'ఎవడు, ఆ పాపిష్టోడేనా మళ్లీ వచ్చాడు' అంది కోపంగా. కొండయ్య జేబులోంచి ఓ వంద రూపాయల నోటు తీసి పెళ్లాం చేతిలో పెట్టాడు. నోటు విసిరి కొట్టింది. 'ధూ.. నోరులేని పసి పిల్లలని అమ్ముకుని సంపాదించే యీ పాపిష్టి డబ్బు నాకొద్దు - నీవే వుంచుకొని మరి రెండు బుడ్లు కొనుక్కుని తాగి చావు - పాపిష్టోడా'.

'నోరుముయ్యే - డబ్బు పాపిష్టిది కాదే - గంజికి నేక మాడేవాళ్లం - పెంచలేక పిల్లలని కడుపు మాడ్చి సంపే కంటే సుఖంగా వుండే చోటికి పిల్లలని యివ్వడం పాపమేటే. పిల్లలు ఎక్కడున్నా సుఖంగా బతికితే ఆ పున్యం మనదే - మన దగ్గరేటి వుంది. గంజి నీల్లు. పెంచుకున్నోళ్ళు గొప్పోళ్లు అయితే ఆల్లు సుఖంగా బతకతారు. నే సేసేది పాపపు పనేటి. సాలా మంచి పని - మన గూడెంలో బతికే పిల్లల్ని సూత్తన్నాంగా, దిస మొలలతో గంజి నీళ్లు తాగి ఓ అచ్చరం ముక్కయినా సదూ లేక మనలాగే కూలి నాలి చేసుకు బతుకుతున్నారు. అలా బయటికి వెళ్లిన పిల్లలు సుకంగా మా రాజుల యింట్లో బతకతన్నారట - ఏదో మనం సేసే సాయానికి నాలుగు డబ్బులుచ్చుకోడం పాపమేంటి - ఏ పనన్నా ఉత్తినే ఎవడు సేస్తాడే - నే సేయక పోతే ఆ పని మరోడు సేస్తాడు - "యిప్పుడు జవాబు చెప్పు అన్నట్టు ధీమాగా చూశాడు. వెంకటమ్మ తిరస్కారంగా చూసింది. హేళనగా ఓ నవ్వు నవ్వి 'సేస్తున్న ఎదవ పని సమజీయించుకుంటే సరి పోదు. పిల్లల్ని కన్నాక పెంచలేక గొప్పోళ్లకి పెంపకం యివ్వడం తప్పు కాదురా - కాని, పెంపకాల కియ్యడం కోసం పిల్లలని కని పెంచి అమ్ముకోడం తప్పురా - ఎదవ బ్రోకరు పని సేస్తూ చేసిన తప్పు కప్పెట్టుకుందామని సూస్తే పరిపోదు. దేముడి దయ వల్ల నీ వాపరేషను సేయించుకుని నే బతికి పోనాను. నేకుంటే ఏడాదికో బిడ్డని కనిపించి అమ్ముకునే వోడివి' ఛీత్కారంగా అంది.

'అదేనే, నే సేసిన పెద్ద పొరపాటు, నాకేటి తెలుసు. యిలాంటి బేరాలు తగులు తాయని. నేకుంటే యీ పాటికి ఎన్నివేలు సంపాదించేవోడినో, ముగ్గురు పిల్లలు సాలని పోరెడితే పోనీ అని ఆపరేసను సేయించుకుంటి' మంచి అవకాశం పోగొట్టుకున్నానన్న బాధ కొండయ్య గొంతులో ధ్వనించింది. "పిల్లలని అమ్ముకోడం అంటే పాపం అని కూడా అనిపించదు యీ పాపిష్టోడికి' 'ఏటే పాపం. కష్టపడి పొలం దున్ని, విత్తేసి పంట చేతికొస్తే అమ్ముకోడం లేదూ - విత్తేసి చెట్టున కాయో, పండో కాస్తే మనం వేశాం అని అన్నీ మనమే తింటున్నామా - మన కెక్కువయినవి బజారున అమ్ముకోవడం లేదా పాపం ఏమిటి. అదీ డబ్బుకోసమే, ఇదీ డబ్బుకోసమే...' లా పాయింటు దీసి మాట్లాడుతున్న మొగుడ్ని నోరెళ్ల బెట్టి చూసింది వెంకటమ్మ.

'ఓరి సచ్చినోడా - సెట్టున కాయో, పండో కోసి అమ్ముకోడం ఆడది నవమాసాలు మోసి నరకయాతన పడి బిడ్డని కనడం నీకొగలాగే కనపడతందా. మీ మగాళ్ల కేం తెలుస్తదిరా బిడ్డని కనడంలోని బాధ - కడుపున పడ్డ దగ్గర నుంచి ఏయిళ్ల బాధ - నెలలు నిండిన కొద్ది గుండెలని బిడ్డ తన్నే బాధ - కాన్పులో పేగులన్నీ మెలిపెట్టే బాధ, శరీరాన్ని చీల్చుకుని బిడ్డ బయటికి వచ్చే నరకం, చెట్టున కాయ కోసినంత తేలిగ్గా మాటాడే మీ మగాళ్ళకేటి తెలుస్తుంది. బిడ్డ పుట్టనిచ్చి బలం రావడానికి రెన్నెల్లో, మూన్నెల్లో తల్లిపాలు తాగిపించి ఆప్పుడు కోడి పెట్ట బాగా బలిసిందనో, మేక పిల్ల కండ పట్టిందనో అమ్మడానికి తయారయ్యే కసాయి నా కొడుకులకి ఆడదాని పేగు బాధ ఏటి తెలస్తందిరా - యీ బ్రోకరు ఎదవ పని మానకపోతే సూడి, యింకే ఆడదాని కన్నా కన్న కడుపుకి ఎసరెట్టావో యీ కొరకం బెట్టి నిన్ను తగలపెడతా - పో, నాకు నీ మొగం సూపకు తీక్షణంగా మండుతున్న కట్టెపేడు చూపి బెదిరించింది. నిర్లక్ష్యంగా నవ్వుకుంటూ వెళ్లిపోయాడు కొండయ్య. పొయ్యి ముందు కూర్చున్న వెంకటమ్మ ... నలుగురు పిల్లలని కన్న తల్లి గుండె మంట పొయ్యిమంటకి తీసిపోదు.

కోడి పెట్ట ఎప్పుడు గుడ్డెడతదా అని సూసినట్టు యీ ఎదవ ఏ ఆడది నీళ్లాడిందా అని డేగ కల్లతో సూసి ఆ దొండ సచ్చినోడు వచ్చినప్పుడు సెప్పడం యిడి డూటీ అయిపోనాది - నెలకోసారి జీపేసుకొచ్చి నీళ్లోసుకున్న ఆడదాని వయసంతో తెలియగానే అడ్వాన్సు డబ్బులు యిడి చేతిలో పెట్టి పోతాడు. ఆనక ఆ మొగుడ్ని పిలిచి బేరాలు మొదలెట్టి రేటు కుదుర్చుకుంటాడు. యీ దొంగ నాకొడుకులకి యిదో బిజినెస్సయి పోనాది - యిలా

నువ్వే గెలుస్తావు

ఓట్ల కోసం
నాయకులొస్తున్నారు
అడుగులకు మడుగు లొత్తుతారు
నెత్తిన కిరీటాలు పెడతారు
దేవుళ్ళని చేస్తారు
బహు పరాక్!
హామీల ఉలులతో
రాజకీయ శిల్పులు
ఓటర్లను అందంగా చెక్కటానికి వస్తున్నారు.
ఇప్పుడు దొరికితే
ఐదేళ్ళు ఒంటి నిండా గాయాలు తప్పవు
నోట్ల కమ్ముడుపోతే
అడిగే హక్కుండదు జాగ్రత్త!
ఓటు వేసే ముందు
పుటం పెట్టి
వన్నె నిగ్గు తేల్చుకోవాలి
మనిషిని చూసి,
మనసుని చూసి ఓటెయ్యి
నువ్వే గెలుస్తావు!

-నూతలపాటి వెంకటరత్న శర్మ

చూపుడు వేలు

వడగళ్ళ వానలా
అబద్ధాలు కురుస్తూ
జీడిపాకంలా
నాలుకలు తెగ సాగుతూ
ఉదారంగా వాక్యాలు.

చంచల వేగంగా అభినయాలు
పావులు కదుపుతూ వ్యూహాలు
క్షణక్షణం
ముఖకవళికలు మారిపోతున్నాయి.

చెల్లని మాటల దానాలు
చిల్ల పెంకుల్లా పడుతున్నాయి
దూరంగా జరగండి.

ఐదేళ్ళ జాతర పరిభాషలో
మనుష్యులు చాలరకాలు
ఉడుకురక్తం వెన్నెముక
వెనుకబాటుతనం అస్పృశ్యం
అల్ప సంఖ్యలు అర్థభాగాలు
తలలు లెక్కించి
ప్రయోజనాలతో భాగించాలి
మోహాల్ని ప్రలోభం చేసి
ఆశలతో హెచ్చ వేయాలి.

అసందర్భ చారిత్రిక భాష్యాలు
సంకల్ప నినాదాల హోరు

జనం నేలతల్లి
ఇరుకిరుకుగానే వున్నారు
సేద తీరడానికి ఆగి
నిలబడే దారిలేదు.

బహుళ జ్ఞాన సందోహాలు
ఉదాసీన అంచుల్లో మునిగితే
అధికార సింహాసనాల నిండా
మనో మాలిన్యాల రొంపి.

రాజకీయానుసంధానం పునరేకీకరణలు
స్వగృహ ప్రవేశాలు ఆత్మగౌరవాలు
ఆధిక్య శిఖరాల అధిరోహణకు
కించిత్తు అవకాశ సోపానాలు
సిద్ధాంతాల్నీ విలువల్నీ
వాళ్ళు సునాయాసంగా బద్దలు కొడతారు.

గాయాల సంగతి
నాకు ఇంగితమే
దేశ దేహం ప్రక్షాళన
ఒట్టి మాటలు కాదు.

ఇపుడు కదలాల్సింది చూపుడు వేలే
ఆయుధం ఇదొక్కటే
బాహ్యాంతర కోణాల్ని తడిమి
మీట నొక్కాలి, సూటిగా

-దాట్ల దేవదానం రాజు

అట్ట వెళ్లిన ఆడపిల్లలని అనాదలని చెప్పి పెంపకాలకి యిచ్చేస్తారుట డబ్బులు తీసుకుని – ఈళ్ల మొహాన ఐదారు వేలు కొట్టి ఏభై వేలకి, తెల్ల దొరలకైతే లచ్చకి కూడా అమ్ముతారంట. పిల్లలు అందంగా బొద్దుగా వుంటే రేటు పెరుగుతుదట! ఆ పిల్లని నిజంగా పెంచుకుంటారో ఆనక ఆల్లతో ఏటిసేస్తారో అ భగమంతుడి కెరిక. ఇదో కొత్త వేపారం మొదలైంది. ఎప్పుడు కనివినీ ఎరగని ఏపాపం. డబ్బుల కాశపడి పెల్లాలకి కావాలని కడుపులు చేసి, కానుపులు సేయించి తల్లిని బిడ్డను వేరు సేసి పాపం సుట్టుకుంటున్నారు, యీ మగ ఎదవలు. డబ్బుల కోసం ఎన్ని కానుపులయినా కనిపిస్తున్నారు మొగుళ్లు. పాపం కిందటేడు నర్సిగాడి పెళ్లాం ఆరో కానుపులో సచ్చి బతికి బయటపడింది. వంట్లో పానం లేదు. ఏటా కానుపులు

నర్సిగాడు తాగుబోతు ఎదవ. డబ్బుల కోసం పెళ్లాన్ని ప్రతి ఏడాది పురిటి మంచం ఎక్కిస్తున్నాడు. యీ ముత్యాలు పొలం అప్పు యిడిపించుకోడానికి వండంటి బిడ్డనిచ్చేశాడు. అప్పటి నుంచి డబ్బు రుచి మరిగిన ఎదవలు. యిప్పుడు ఆడది ఎప్పుడు నెల తప్పతదా అని ఎదురు సూడ్డం అయిపోయింది మూడేళ్లుగా యీ వాడలో.

వెంకటమ్మకి తల్చుకుంటే భగ్గున మండుతూంది. యీ ఘోరం ఆపడం ఎట్లా, యీ ఎదవలందరిని పోలీసుల కప్పచెప్పాలని జైల్లో కూచో పెట్టాలని అనిపిస్తుంది. కాని పోలీసులకి ఎలా చెప్పాలి. అది ఆమెకు తెలియదు. చుట్టుపక్కల చిన్న పల్లెలు తప్ప పెద్ద వూర్లులేవు. పోలీసుస్టేషను తాలూకాలో వుంటుందని వింది. అది ఎంత దూరమో ఎలా వెళ్లాల్లో కూడా ఆమెకి తెలియదు. ఆ కుగ్రామంలో పట్టుమని నూరిళ్లు కూడా లేవు. ఓ పడిపోతున్న పాక ఎలిమెంటరీ స్కూలు. దాన్లో పంతులు ఏడాదికి రెండు నెలలన్నా వుండరు. అలాంటి చుట్టు ప్రక్కల కొన్ని గ్రామాలకి కలిపి ఓ పోలీసు స్టేషను వుంటుందట. వెళ్లాలంటే మెయిన్ రోడ్డు కాడ కాపు కాస్తే ఆ బస్సు ఎప్పుడో వస్తది. ఒక్కర్తి, ఆడది మొగుడికి తెలీకుండా తనెట్లా వెళ్లగలదు. ఆమె ఆలోచనలవి . ఏదో చేసి ఈ అరాచకాన్ని ఆపాలని వుంది గాని, ఏం చెయ్యాలో, ఎవరితో చెప్పాలో ఆమెకు తెలియదు.

***

'అప్పా', మర్నాడు పది గంటల వేళ మగవాళ్లు యింట్లోలేని సమయంలో ముత్యాలు భార్య చుక్కమ్మ వచ్చి వెంకటమ్మని చుట్టుకుని బావురుమని ఏడ్చింది. 'ఏందే, ఏటే ఏం జరిగిందే. ఏం చేశాడే, కొట్టాడా' వెంకటమ్మ చుక్కమ్మని విడిపించుకుని ఏడుస్తున్న ఆమెని చూస్తూ ఓదార్పుగా అంది. వెక్కివెక్కి ఏడుస్తూ – 'అప్పా, మళ్లీ యీ బిడ్డని కూడా అమ్మడానికి డబ్బుచ్చుకున్నాడే ముత్యాలు – యింక సాలు పిల్లలన్నా వినకుండా ఆ వెధవకి అమ్మడానికి మళ్లీ నెల తప్పించాడే" వెక్కిళ్లు పెడ్తూ అంది.

'యీళ్ల జిమ్మడ – మనం మడుసుల్లా కనపడ్డం నేదు గాబోలు' – పిల్లల్ని కనే మిసను లనుకుంటున్నారా యీ సచ్చినోల్లు.

'అక్కా... సచ్చి బతుకుతూ మనం కనడం – యీల్లు పుట్టినోళ్ళని, పాలు తాగుతున్న పసి వోళ్లని గుంజుకు పోయి డబ్బులు తెచ్చుకోడానికెగపడ్తన్నారు. మనం ఎన్నాళ్లిట్టా యీ బాధలు పడాలప్పా. కనాలంటే భయమేస్తుంది. యీ సచ్చినోళ్లకి కష్టపడనక్కర లేకుండా డబ్బులొస్తన్నాయని, ఇదే బాగుందనుకుంటున్నారప్పా' – కళ్లు తుడుచుకుంటూ అంది

'సుక్కీ – మనం యీ వెదవలకి బుద్ధి సెప్పాలే – ఏటి సెయ్యాలో తెలీడం లేదే' విచారంగా అంది.

'అక్కా, మన తండాలో ఆడవాళ్లం అంతా కలిసి పట్నం వెళ్లి పోలీసులకి సెపుదామా'

'ఎట్టా వెడతామే – యీ ఎదవలకి తెలిస్తే సంపుతారు గందా – బస్సెక్కి పోవాల్న పట్నం ఎల్లాలంటే – సుక్కి రేపు ఆడోళ్లం అందరం కలిసి ఏదన్నా ఉపాయం ఆలోచిద్దాం

వుండప్పా, రేపుదాకా ఎందుకు, యిప్పుడే ఎల్లి అందరిని పోగేసుకొస్తా... సుక్కి పావుగంటలో పదిమంది ఆడాళ్లని వెంటపెట్టుకు వచ్చింది. అందరిలోకి ఎక్కువ మంది పిల్లల్ని అమ్మిన నర్సిగాడి భార్య వరమ్మకి మరీ కక్షగా వుంది. 'అప్పా అందరం కలిసి తిరగబడితే యిల్లేటి సేస్తారు. నా వల్లు గుల్లయిపోనాది – యీసారి కాన్పు అయితే మరీ బతకవని పట్నంలో డాక్టరమ్మ బండ బూతులు తిట్టింది. కిందటిసారి కాన్పు కష్టమయితే బండిలో వేసుకు, సావు బ్రతుకులలో ఆస్పత్రికి తీసికెళ్లారు. ఆపరేషను చేసి బిడ్డను ఆఖరి నిముషంలో తీసి రక్షించారు వరమ్మని. లచ్చుమమ్మ ముందుకు వచ్చి 'అప్పా, నేనో ఉపాయంసెప్పనా, నా సెల్లి పట్నం ఆసుపత్రిలో నర్సు ఉద్యోగం సేస్తంది గదా, నన్ను సూసిపోడానికి నిన్న వచ్చింది. మళ్లీ రేపెళ్లి పోతుంది. దాని సేత కబురెడదమా పోలీసోల్లకి" – ' ఉపాయం చెప్పింది – 'పిలు, పిలు మీ సెల్లిని పిల్చుకరా' అంతా ఉత్సాహంగా అన్నారు. రత్నం మెట్రిక్ వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువు కుని స్కాలర్‌షిప్పుతో నర్సు కోర్సు చేసింది. ఎస్‌టి క్లాసు కింద ఉద్యోగం సులువుగా దొరికింది. తన చెల్లి చదువుకొందని ఉద్యోగం చేస్తుందని లచ్చిమికి గర్వంగా వుంటుంది. రత్నం అందరి మధ్య నాయకురాల్లా కూర్చుంది. – సంగతి అక్క ద్వారా అప్పటికే విని వుందేమో కోపంగా 'అసలు మీరంతా ఎలా వూరుకొంటున్నారు. యింత అన్యాయం , ఘోరం జరుగుతుంటే అంది. ఏటి సెయ్యమంటావమ్మా కట్టుకున్నాడే యింత అన్యాయం సేస్తంటే ఎవరికి చెప్పాలి.

'ఎదురు తిరగాలి అంతా ..... రత్నం వాళ్లందరిని చూస్తూ తిరగబడాలి. యిలా పిల్లల్ని అమ్ముతున్నారని పోలీసులకి చెప్తామని బెదిరించాల్సింది'.

'కుళ్ల బొడుస్తారు. పోలీసులకు సెపితే యీళ్లు తన్నితగలేస్తే మాకేటి దిక్కు. యీ సంటి పిల్లల్ని పెట్టుకుని ఏడకి పోవాలి మేము'

అదీ నిజమే. తిరగబడితే పరిణామాన్ని ఎదుర్కొనే శక్తి వీళ్లకెక్కడ వుంది. రత్నం ఆలోచించి 'చూడండి. మీరేమీ తెలీనట్లుండండి. నేను వూరెళ్లాక మా వూర్లో కలక్టరమ్మకు జరిగేది సెపుతా. ఓ ఉత్తరం రాసి యిస్తాను. నేను రాసి తెస్తాను. మీరంతా వేలి ముద్రలు వేసివ్వండి – నేను మీ అందరి పేర్లు రాసి అప్లికేషను యిస్తా – మిగతాది ఆళ్లే సూస్తారు – కలెక్టరు మన ఆడదే గనక మీకు జరిగే అన్యాయం చూస్తూ వూరుకోదు. నేను గట్టిగా చెపుతా" అప్పటికప్పుడు అక్కడ కూర్చుని కలెక్టరు పేర ఫిర్యాదుచేసి అక్కడున్న ఆడవాళ్లందరి చేత వేలి ముద్రలు పెట్టించింది. 'మీరెక్కడా నోరు జారద్దు – ఎవరన్నా వచ్చి

ఏదన్నా వాకబు చేస్తే అప్పుడే మీకు తెలిసి నట్లుండండి. పోలీసులు గాని, గవర్నమెంటు ఆఫీసర్లు గాని వస్తే జరిగింది చెప్పండి అంతే –' అందరికీ చెప్పింది . అంతా తలలాడించారు సంతోషంగా.

***

పదిహేను రోజుల తర్వాత – ఆ చిన్న కుగ్రామంలోకి రెండు జీపులు, ఓ అంబాసిడర్ కారు వచ్చి ఆగాయి. వూర్లో సర్పంచ్, తాలూకా ప్రభుత్వోద్యోగులు, డవాలా బంట్రోతు, పోలీసు ఇనస్పెక్టరు, కలక్టరమ్మ క్యాంపు కొచ్చిందిట అంటూ జనం వింతగా మాట్లాడు కున్నారు. గ్రామ పంచాయతీ ఆఫీసు దగ్గర కలక్టరమ్మ కూర్చుంది. సర్పంచి ద్వారా కొండయ్యకి కబురెళ్లింది. తనని ఎందుకు పిలిపించారో తెలియక భయంగా వచ్చి చేతులు కట్టుకు నిల్చున్నాడు కొండయ్య. 'కొండయ్యంటే నీవేనా – పిల్లల్ని అమ్మే బ్రోకరు పని చేస్తున్నావా' ఉపోద్ఘాతం లేకుండా సూటిగా అధికారికంగా అడిగింది కలెక్టరు. బిక్క చచ్చిపోయాడు కొండయ్య. అతను ఎదురు చూడని సంఘటన యిది.

'ఏమిటి మాట్లాడవు – వుట్టిన పిల్లలని ఓ కంట్రాక్టరుకి అమ్ముతూ బ్రోకరు పని చేస్తున్నది నిజమేనా – నిజం చెప్పు. లేకపోతే జైల్లో కూర్చుంటావు – ఎవరా కంట్రాక్టరు !? పేరేంటి – ఎక్కడుంటాడు? ప్రశ్నలు గుప్పించింది అధికారం ప్రదర్శిస్తూ. బిక్కమొగం వేసి 'తెలియదండి' చేతులు నులుముకుంటూ వినయంగా అన్నాడు. 'అంటే, పేరు, ఊరు తెలియకుండానే యిద్దరూ కల్సి పిల్లల వ్యాపారం చేస్తున్నారన్న మాట – నిజం చెపుతావా, పోలీసులని పిలిపించాలా –

కొండయ్య చటుక్కున వంగి కలెక్టరు కాళ్ళు పట్టుకున్నాడు. 'సత్తెపెమానకంగా నాకు తెలియదండి – పేరడగలేదండి ఎప్పుడూ'. వాడి మొహం చూస్తే నిజమే చెప్తున్నాడనిపించింది కలక్టరుకి. లే ముందు, వాడి సంగతి తరువాత ముందు ' నీ సంగతి చెప్పు. ఎంత మంది పిల్లలని అమ్మావు. యింతవరకు వాడికి. ఈ బేరం ఎప్పటి నుంచి సాగుతున్నది. అనలు యిదంతా ఎలా ఆరంభించావు..'

అప్పటికే వూర్లో వున్న జనం చుట్టూ మూగారు. ఆడవాళ్లంతా కలక్టరమ్మ పక్కకి వచ్చి నిలబడ్డారు. అందరి ముందు పరువు పోయినట్టు దోషిలా తలదించుకున్నాడు కొండయ్య. నీళ్లు నమిలాడు జవాబు చెప్పకుండా.

'ఊ.. చెప్పు తొందరగా. చెప్పకపోతే పోలీసులని పిలిస్తే లాఠీదెబ్బలు రుచి చూస్తే నీవే చెపుతావు – ఇది ఎలా ఆరంభించారు. నాకన్ని సంగతులూ తెలియాలి. ఇక్కడ యిలా పిల్లల అమ్మకాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి తెలిసి విచారణ జరిపించమని నన్ను పంపించారు" కోపంగా అంది. కొండయ్యకి ఈ సంగతి బయటికి ఎలా తెల్సిందో ఎవరు చెప్పారో ఎంత ఆలోచించినా అర్థం కావడం లేదు.

'ఓపాలి... ముందస్తుగా ఆ కంట్రాక్టరు బాబు వచ్చాడండి. ఊరి పొలిమేరలో నేను కనిపిస్తే పిలిచాడండి. ఈ వూర్లో మంచి చంటి పిల్లలు పెంపకానికి ఎవరన్నా వున్నారా, నాకు పిల్లలు లేరు. చక్కగా వున్న ఓ ఆడపిల్లని పెంచుకోవాలనుకుంటున్నాను డబ్బు బాగా యిస్తాను. వుంటే సెప్పు వెళ్లి మాట్టాడాతానన్నారండి.

"తరువాత' అంది కలెక్టరు... అప్పటికి ముత్యాలుగాడి పెళ్లాం నీళ్లాడి ఇరవై రోజుల పిల్లుంది. అది గుర్తొచ్చి చెప్పా.. ఆళ్లు పెంపకం మరి యిస్తారో లేదో తెల్వదని చెప్పాను. అడిగి సూద్దామన్నారు. ఎంట పెట్టుకు ఎల్లానండి. అప్పటికి ముత్యాలు పొలం తాకట్టు పెట్టి బోలెడు అప్పులో మునిగాడు. ముందు ఆడి పెళ్లాం మెత్త పడలేదు. యిద్దరు పిల్లలున్నారు. మనం పీకలదాకా అప్పుల్లో మునిగాం, ఏం పెట్టి యీ పిల్లని పెంచుతాం, పిల్లనిస్తే మన పొలం యిడిపిస్తానంటున్నారు ఈ బాబు. పిల్లలు లేరు, ముద్దుగా మన పాపని పెంచుకొంటారు అని దాని మొగుడు దాన్ని వప్పించాడండి. పన్నెండు వేలకి బేరం కుదిరింది. 'ఈసారి పెంపకానికి కాగితాలు తయారు చేయించి తెస్తాను. అడ్వాన్సు అంటూ రెండు

వేలు చేతిలో పెట్టి వెళ్లాడు. ఇంకో నెలపోయాక కాగితాలట్టుకు వచ్చి ఏలి ముద్రలు వేపించుకుని పిల్ల నట్టుకు ఎల్లిపోనాడు.

'అది సరే, మరి తరువాత ఎందుకు వచ్చాడు. ఏమడిగాడు. యిలా యింత మంది పిల్లల్ని ఎందుకు తీసికెళ్లాడు దబ్బిచ్చి.'

'మరోసారి వచ్చి తన స్నేహితులు ఇంకెవరో యీ పావని చూసి యింకో పావ వుంటే తెమ్మని అడిగారన్నాడు. యింకా యిద్దరు ముగ్గురు పిల్లలు లేని వాళ్ళు అడుగుతున్నారు. మీరెలాగో పెంచలేరు - పిల్లలు లేని వాళ్లకిస్తే చక్కగా పెరుగుతారు . మీకు నాలుగు డబ్బులొస్తాయి. నీవు మీ తండావోల్లకి చెప్పి వప్పించు. నీ కష్టం వుంచుకోను అని అన్నారండి.

'ఇప్పటికి ఎంతమందిని తీసికెళ్లాడు? కలెక్టరు అడిగింది. కొండయ్య బుర్ర గోక్కుని ఆలోచిస్తుంటే వెంకటమ్మ 'ఆ సచ్చినోడే యిప్పటికి ఏడుగురు ఆడపిల్లల్ని తీసి కెళ్లాడండి అంది" మగపిల్లలని ఎప్పుడూ తీసికెళ్ల లేదా?"

'నేదండి, ఆల్లకి ఆడపిల్లలే కావాలంటండి' కొండయ్య అన్నాడు.

"ఎంత పెట్టి కొనే వాడు పిల్లల్ని, నీకెంత యిచ్చేవాడు".

"ఓ సారి పదివేలకి బేరం కుదిరింది. ఇంకోసారి ఓ వెయ్యి, రెండు వేలు ఎక్కువిచ్చే వాడు. బాగున్న పిల్లలకి ఎక్కువ యిచ్చేవాడు. పిల్లలు తెల్లగా బొద్దుగా వుంటే ఎక్కువ డబ్బిస్తారు అనే వాడు. నాకు ఒక్కో పిల్లకి ఐదొందలు, వెయ్యి యిచ్చేవాడు.

"ఆ కంట్రాక్టరు ఆడపిల్లలని కొని వ్యాపారం చేస్తున్నాడని నీ కనిపించలేదా. యిది అపరాధం, నేరం అని నీకు తెలియదా!"

'నాకేటి తెలుసండి. ఆడు పెంపకానికి పిల్లలు కావాలంటే పోనీ గొప్పింట పెరుగుతారను కున్నాను. నాలుగు డబ్బులొస్తాయని ఆశపడ్డాను'.

'ఇలా పిల్లల్ని తీసికెళ్లి విదేశాల వారికి పెద్ద మొత్తాలకి అమ్మి డబ్బు చేసుకుంటున్నారు కొందరు. అనాధాశ్రమం నడుపుతున్నట్టు, అనాధ పిల్లలని పెంచుతున్నట్టు నాటకాలాడి పిల్లల్ని కొని అమ్మడం వీళ్ళ వ్యాపారం - అలాంటి వ్యక్తికి నీవు సాయం చేసినందుకు నీకు శిక్ష పడ్తుంది తెలుసా' దబాయించింది కలక్టరమ్మ.

"ఆ దొంగ సచ్చినోడు నెలకోసారి వచ్చి ఎవరు నీళ్లోసుకున్నారా అని ఆత్రంగా వెతకడం, మా మగోళ్లు ఆడాళ్ల చేత పిల్లలని కనిపించడం, అమ్మడం ... మేం పడే కట్టం ఆల్లకెందుకండి. కోడి గుడ్లమ్ముకున్నట్టే, మేకల్ని అమ్ముకున్నట్టే మా చేత కనిపించి అమ్ముతున్నారండి" ఆడవాళ్లంతా కల్సి ఏక గొంతుతో అన్నారు.

'ఆ కంట్రాక్టరు ఏవూరి వాడో, పేరేమిటో కూడా తెలియదంటున్నావు నీకు నిజంగా తెలియదా, నాటకాలాడుతున్నావా?" గంభీరంగా అడిగింది.

"సత్తెపెమానకంగా తెలీదండి. జీపులో వచ్చే వాడు. పోయేవాడు. నేను పేరు అడగ నేదు.

'జీపు నంబరు తెలుసా పోనీ! వూర్లో ఎవరన్నా నంబరు చూశారా, చెప్పగలరా?"

"నాకేం తెలస్తది. సదూ రాదు నాకు అందరూ మొహాలు చూసుకున్నారు తప్ప జవాబు చెప్పలేదు. 'వూర్లో ఎవరికి చదువు చట్టుబండలు లేవు. ఒకరిద్దరికి అక్షర మ్ముక్కలు వచ్చినా జీపు నెంబరు గుర్తు పెట్టుకోవాలని ఎందుకనిపిస్తుంది. కలక్టరు అక్కడున్న ఆడవాళ్లందరి వైపు చూసి 'ఏమ్మా - మీరంతా మూడు నాలుగేళ్లుగా వూరు కున్నారు. కనీసం పోలీసులకి చెప్పాలనైనా తెలియదా.

"ఇక్కడ పోలీసుటేషను నేదు కదండి' ఎవరో చిన్నగా అన్నారు.

"యిప్పుడు వాడిని పట్టుకోవాలంటే ఈ వూర్లో వాళ్లు సాయం చెయ్యాలి. ఈసారి వాడు వచ్చినప్పుడు వాడ్ని వదలకుండా పట్టుకుని బంధించి పోలీసులకి చెప్పాలి' అంటూ సర్పంచ్ వంక తిరిగి 'వూరి అధికారిగా నీ వెలా కళ్లు మూసుకున్నావు. నీకు తెలియదా జరిగేది' నిలదీసింది. నీళ్లు నమిలాడు. 'నాకెవరన్నా సెపితే గదండి తెలస్తది. వాడెవడో ఎప్పుడొస్తాడో ఎందుకొస్తాడో నాకెలా తెలుస్తుంది' సంజాయిషీ యిచ్చాడు. "సరే, జరిగిందేదో జరిగింది. ఈసారి వాడు వచ్చినప్పుడు ఎవరు చూసినా సరే వాడ్ని పోనీ కూడదు. పట్టుకుని ఓ తాడేసి కట్టేసి యీ సర్పంచ్‌కి చెప్పాలి - వాళ్ళు చెప్పగానే పోలీసులకి చెప్పాల్సిన బాధ్యతనీది. ఏం తెల్సిందా - వాడ్ని ఎవరన్నా వదిలేసినా ముందుగా కబురందించినా మీకు శిక్ష పడ్తుంది. కొండయ్యా వాడ్ని పట్టివ్వక పోతే నీకు జైలు శిక్ష తప్పదు జాగ్రత్త - 'ఆడవాళ్లందరికీ ధైర్యం చెప్పి, సర్పంచ్‌కి మరో వార్నింగ్ యిచ్చి వెళ్లింది కలెక్టరు. పోలీసు యినస్పెక్టరుకి చెయ్యాల్సింది ఆర్డరు యిచ్చి వెళ్ళింది.

***

కలక్టరు వెళ్లాక మొగుళ్లంతా పెళ్లాలని గుడిసెలలోకి లాగి చితకబాదారు. ఎన్ని దెబ్బలు తిన్నా ఎవరూ నోరు విప్పలేదు. 'మాకేటి తెలుసు. కలక్టరమ్మ ఎక్కడుంటుందో కూడా మాకు తెలుసా' అంటూ దబాయించారు. వాళ్ల మాటలు నిజమనే అనిపించాయి కాని ఈ కబురు ఈ కుగ్రామం దాటి బయటికెలా వెళ్లిందో ఎవరికీ అంతుబట్ట లేదు. పిల్లల్ని పెంచుకోడానికి తీసుకున్న వారెవరన్నా మాట మాట చెప్పకుంటే బయటికి పొక్కిందేమో అనుకున్నారు మగాళ్లంతా కల్సి. ఏడాది రెండేళ్లకి ఓ పదివేలు చేతిలో పడేవి ఆగిపోయాయి. అన్న దుగ్ధ మగవాళ్లది

***

నెలా పదిరోజులకి వెంకటరత్నం వచ్చి జీపు హారన్ కొట్టాడు కొండయ్య ఇంటి ముందు నాదస్వరం విని కలుగులోంచి పాములు చరచర వచ్చినట్టు దాని కోసమే ఎదురు చూస్తున్న ఆడవాళ్లంతా అరక్షణం ఆలస్యం చేయకుండా ముందే పెట్టుకున్న తాళ్లు పట్టుకు పరిగెత్తి వచ్చారు. కొండయ్య బైటికి వచ్చీరాగానే ఒక్క తోపు తోసి గుడిసె బయట తలుపు బిగించింది. చుట్టు ముట్టిన పాతిక ముప్పై మంది ఆడవాళ్లని చూసి బిత్తర పోయాడు. తెల్లబోతూ జీపు దిగాడు వెంకటరత్నం. ఒక్కళ్ళూ నోరిప్పకుండా అందరూ అన్ని వైపుల నుంచి వచ్చి పట్టేసి ఓ చెట్టు దగ్గరికి యీడ్చి కెళ్లి చెట్టుకు కాళ్లు చేతులు నడుం అన్నింటికి తాడు చుట్టేశారు. గింజుకున్నాడు. అరిచాడు. ఎవరూ జవాబివ్వలేదు. వాళ్లలో ఓ కుర్రాడిని సర్పంచి దగ్గరికి తోలారు. సర్పంచ్ డొక్కు మోటారు సైకిలేసుకుని పోలీసుస్టేషన్ వైపు వెళ్లాడు.

'ఆనాడు పుట్టిన బిడ్డల్ని పుట్టిన వాళ్లని పుట్టినట్టే కంసుడు చంపేస్తుంటే ఆ దేవకి కడుపుకోతే యీనాడు యీ ఆడవాళ్లది - నీవా కంసుడి అంశం గాబోలు. అందుకే పుట్టిన వాళ్లని తల్లి నించి వేరు చేసే పాపానికి వడిగట్టావు. కృష్ణుడు పుట్టి కంసుడ్ని అంతం చేశాడు. ఈ యుగంలో ఆడవాళ్లని ఆదుకోడానికి ఏ కృష్ణుడు రాడు గదా. ప్రతి యుగంలో కంసుళ్లు, నరకాసురులు పుడ్తూనే వుంటారనడానికి నీలాంటి వాళ్లే సాక్ష్యం. మాకు మేమే సత్యభామావతారాలు ఎత్తుకోవాలి' నర్మ గర్భంగా అంటూ నవ్వింది . సెలవు మీద వచ్చి వున్న రత్నం.

ఉగాది...

బ్రహ్మమతి నుంచి
కల్పాదికి
అంకురమైన వేళ యిది.

రవి నుంచి
తేజోకిరణమ్ము
జనించిన సమయమ్మిది

మది నుంచి
మధువు చిందించే
అమృత క్షణమ్మిది

కవి నుంచి
కవితా ఝరి
వెల్లువైన వైనంబిది

వేణువు నుంచి
నాద ప్రవాహం
విందు చేసే కాలమ్మిది

కల నుంచి
కనుల ముందుకు
అరుదెంచిన సంతోషమ్మిది

కలియుగాన
గిలి కలిగించే
కృతాయుగపు ఆశ యిది.

ఉగాది
ఉషస్సుకు నాంది
ఉగాది
తేజస్సుకు పునాది
ఉగాది
ఉజ్వల మయ వసంతానికి నిధి
ఉగాది
సంగీత సాహిత్య సాంస్కృతిక నీరధి

-ఘనపురం దేవేందర్